అన్నదాత చిద్విలాసం

- జగనన్న ప్రభుత్వంలో తీరిన పెట్టుబడి కష్టాలు
- వైఎస్సార్ రైతు భరోసా, సున్నావడ్డీ రాయితీ సొమ్ము
- ఐదేళ్లలో రైతు భరోసా కింద రూ.987.7 కోట్లు జమ
- సున్నా వడ్డీ రాయితీ కింద రూ.32.36 కోట్ల లబ్ధి

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అండగా నిలిచారు. నవరత్న పథకాల్లో అతి ముఖ్యమైన ×వైఎస్సార్ రైతు భరోసా₹ వైఎస్సార్ సున్నావడ్డీ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తూ రైతు పక్షపాతిగా మరోమారు రుజువు చేసుకున్నారు. కష్టాలు ఎన్ని ఉన్నా రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తూ వచ్చారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా వ్యవసాయ రంగంలోనూ విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. గ్రామాల్లో ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి, విత్తు నుంచి విపత్తు దాకా అన్నదాతల వెన్నంటే నిలిచారు. పెట్టుబడి కోసం ఏటా రూ.13,500 అందించి, ఆదుకున్నారు. రైతులకు వడ్డీ భారం తగ్గించడంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ తీసుకురావడమే లక్ష్యంగా 2019 ఖరీఫ్ సీజన్ నుంచి వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ విధానం రైతులకు ఎంతో ప్రయోజనం చూకూరింది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 2019 నుంచి 2023 వరకు 7,35,353 మంది రైతులకు రూ.957.64 కోట్లు ఇప్పటికే జమైంది. తాజాగా 2024 సీజన్‌కు సంబంధించి గురువారం 1,50,343 మంది రైతులకు రూ.30.06 కోట్ల మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి రైతు ఖాతాలకు జమ చేశారు. మొత్తంగా 8,85,696 మంది రైతులకు రూ.987.7 కోట్లు జమ అయ్యింది. సున్నావడ్డీ రాయితీ ద్వారా 2021 రబీ నుంచి 2023 వరకు 81,921 మంది రైతులకు రూ.24.14 కోట్లు విడుదల చేయగా, తాజాగా 2024 రబీకి వరకు గురువారం 39,691 మంది రైతులకు రూ.8.22 కోట్లు జమ చేశారు. మొత్తంగా 1,21,612 మంది రైతులకు రూ.32.36 కోట్లు విడుదల చేశారు. ఈ మొత్తం అర్హత ఆధారంగా రైతు ఖాతాల్లో జమ అయ్యింది. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఒక్కో రైతుకు రూ.67,500 జమ

నవరత్న పథకాల్లో ఓ హామీ వైఎస్సార్ రైతు భరోసా. ఏటా రూ.12,500ల ప్రకారం నాలుగేళ్లలో రూ.50 వేలు మాత్రమే అందిస్తానని అప్పటి ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం జగన్ ఇచ్చిన వాగ్దానం . అయితే రైతు సంక్షేమం దృష్ట్యా రూ.13,500 లకు పెంచి రూ.67,500 చొప్పున పెట్టుబడి సాయం జమచేశారు.



వైఎస్సార్ రైతు భరోసా



సున్నావడ్డీ పథకం

2019- 24 వరకు రైతు భరోసా నిధులు		
నియోజకవర్గం	రైతులు	మొత్తం
రాయదుర్గం	2,17,424	రూ.283.15 కోట్లు
కళ్యాణదుర్గ	2,66,787	రూ.347.41 కోట్లు
ఉరవకొండ	2,51,142	రూ.327.08 కోట్లు
సున్నావడ్డీ పథకం..		
రాయదుర్గం	43,145	రూ.8.8 కోట్లు
కళ్యాణదుర్గం	35,696	రూ.7.88 కోట్లు
ఉరవకొండ	36,080	రూ.7.46 కోట్లు

రైతుల మేలుకోరే ప్రభుత్వం



నాకు ఏడెకరాల పొలం ఉంది. ఏటా రైతు భరోసా, సున్నావడ్డీ రాయితీ సొమ్ము జమ అయ్యింది. ఈ పథకాలు పేద రైతులకు ఎంతో ఉపయోగపడ్డాయి. చాలా సంతోషంగా ఉంది. రైతులు మేలుకోరే ఈ ప్రభుత్వం మరో పదికాలల పాటు చల్లగా ఉండాలి. ఇంటికే విత్తనం, ఎరువులు అందడం మొదలు అనేక పథకాల ద్వారా రైతులను సీఎం జగన్ ఆదుకున్నారు. ఆపత్కాలంలో ఆదుకున్న నాయకుడి వెంటే రైతులంతా నిలుస్తారు.

– సన్న పాలయ్య, రైతు, అడిగుప్ప, గుమ్మఘట్ట మండలం

రైతు పక్షపాతి జగన్



రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా, సున్నావడ్డీ పథకాలను సమర్థవంతంగా అమలుచేసింది. ఈ పథకాలు పేద రైతన్నలకు గొప్ప వరం లాంటివి. అర్హులైన ప్రతి రైతుకూ న్యాయం చేకూరింది. ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి పెట్టుబడి సాయంతో పాటు సున్నావడ్డీ పథకాలు అమలుచేసి రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి గుండెల్లో నిలిచారు. గత టీడీపీ హయాంలో రైతులను దగా చేస్తే..సీఎం జగన్ వారిని అన్ని విధాలా ఆదుకున్నారు.

– మెట్టు గోవిందరెడ్డి, సమన్వయకర్త, రాయదుర్గం

క్లుప్తంగా

నేడు ఎంపీ రంగయ్య పర్యటన

కంబదూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య శుక్రవారం పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం అండేపల్లి, మంద, కుర్లపల్లి, జెల్లిపల్లి, ఒంటారెడ్డిపల్లి, కోటగుడ్డం, మధ్యాహ్నం కంబదూరు, కొత్తపల్లి, జెక్కిరెడ్డిపల్లి, ఓబుగానిపల్లి, తిమ్మాపురం, ఎర్రబండ, గుద్దెళ్ల, మర్రిమాకులపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ


మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా పని చేస్తున్న ప్రసాద్ గురువారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. కార్యాలయంలో ఉద్యోగులు ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ కిశోర్, పలువురు కౌన్సిలర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, మంజునాథ, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి, కృష్ణమూర్తి, నిజాముద్దీన్, మున్సిపల్ ఉద్యోగులు ఈశ్వర్, కిశోర్, మహబూబ్‌బాషా, లక్ష్మీనరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహప్రవేశం


గడేకల్లులో జగనన్న కాలనీలో నూతన గృహ ప్రవేశం చేస్తున్న లబ్ధిదారుడు

విడపనకల్: మండలంలోని గడేకల్లు గ్రామ పంచాయతీలో గురువారం జగనన్న కాలనీలో మతం భీమకవికి చెందిన జగనన్న నూతన గృహాన్ని ఎంపీపీ కరణం పుష్పావతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ వల్ల అనేక మంది నిరుపేదలకు సొంతింటి కల నెరవేరిందన్నారు. గృహప్రవేశ కార్యక్రమానికి విడపనకల్లు నాయకులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, హంపయ్య, కేశవులు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టాల పంపిణీ

వజ్రకరూరు: మండలంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర రెడ్డి విస్తృతంగా పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీరైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం వజ్రకరూరులో ఏర్పాటు చేసే కార్యక్ర మంలో మండలంలో అర్హులై ఉండి ఏళ్ల తరబడి భూములు సాగుచేస్తున్న లబ్ధిదారులకు విశ్వేశ్వరరెడ్డి పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎన్ఎన్‌పీతండా, తట్రకల్లు గ్రామాల్లో తాగునీటి పైపులైన్‌లకు వై.విశ్వేశ్వరరెడ్డి భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులతో సమీక్ష

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై ఎంపీడీఓ సుబ్బరాజు, పీఆర్ జేఈ సుధాకర్ సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలపై మండల అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చంద్రకాంత్, పరుశురామ్, గోవర్ధన్, చరణ్‌తేజ, రాజశేఖర్, సూరజ్‌బాషా, సరస్వతి, శ్రీలేఖ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

బొమ్మనహాళ్: స్థానిక బీసీ కాలనీ వద్దనున్న పెద్దమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ముళ్ల పొదలకు గురువారం నిప్పుపెట్టారు. దీంతో మంటలు ఉన్నపళంగా వ్యాపించాయి. బొమ్మనహాళ్ పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, ఉప సర్పంచ్ పాతన్న స్వచ్ఛభారత్ సిబ్బంది కలిసి స్థానికుల సహాయంతో మంటలు ఆర్పివేశారు. మంటలు విస్తరించి ఉంటే పదుల సంఖ్యలో గడ్డివాములు, బీసీ కాలనీలోని ఇళ్లకు మంటలు వ్యాపించి, పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు అన్నారు.

ఘనంగా అబ్దుల్ వహాబ్‌పీర్ ఖాద్రీ ఉరుసు


హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ వహాబ్‌పీర్ ఖాద్రీ సమాధి

కణేకల్లు: కణేకల్లులోని దివానేపీరా దర్గాలో హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ వహాబ్‌పీర్ ఖాద్రీ వారి ఉరుసు గురువారం రాత్రి ఘనంగా జరిగింది. నిర్వాహకులు దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ వహాబ్‌పీర్ ఖాద్రీ వారి సమాధిపై భక్తులు పూలచద్దర్లను పరిచి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేక ఫాతేహాలు చేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు గుమ్మఘట్ట పీహెచ్ సీ వైద్యులు రమేష్, బాలాజీనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు చెర్లోపల్లిలో జగనన్న సురక్ష

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

6న సర్వసభ్య సమావేశం

రాయదుర్గం రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 6న ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లా బకాష్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లా, మండల ప్రాదేశిక సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పల్స్ పోలియో జయప్రదం చేయండి

కూడేరు: మండలంలో ఈ నెల 3 నుంచి జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. గురువారం కూడేరు పీహెచ్‌సీలో పల్స్ పోలియో నిర్వాహణపై సిబ్బందితో ఆయన సమీక్షించారు. మండల వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులు 3,745 మంది ఉన్నారన్నారు. 3న బూత్‌లెవల్, 4,5న ఇంటింటా తిరిగి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని ఆయన సూచించారు. డాక్టర్ సొమ్యారెడ్డి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్‌డీటీ కార్యాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. డాక్టర్ విజేంద్ర మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు ఈనెల 3న పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఎంపీఈఓ వేణుగోపాల్, సూపర్‌వైజర్ సురేష్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం


పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


అరవకూరులో తారు రోడ్డును ప్రారంభిస్తున్న జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్ రెడ్డి

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్ రెడ్డి

కూడేరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం సాధ్యమైందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అరవకూరులో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. తొలుత కూడేరులో పోలీసు స్టేషన్ దగ్గర నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో అవరకూరు వరకు వెళ్లారు. అనంతరం ఆయన అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారి నుంచి అరవకూరుకు సుమారు రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన తారు రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి తెలియజేశారు. ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకొచ్చాక కూడేరు మండలంలో ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు నీరు విడుదల చేసినట్లు తెలిపారు. గొటుకూరు, అరవకూరు, కమ్మూరు, కొర్రకోడు నుంచి చోళసముద్రం మీదుగా పి.నారాయణపురం గ్రామాలకు సిమెంట్, తారురోడ్లు వేయించిన ఘనత విశ్వేశ్వర రెడ్డికే దక్కుతుందన్నారు.

దొంగ ఓట్లతో గద్దెనెక్కి కేశవ్..
నీ ఆటలు ఇక సాగవ్..

ఎన్నికల వేళ మాత్రమే ప్రజలకు కనిపించి మళ్లీ కనుమరుగై టీడీపీ నేతలు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు ప్రణయ్‌రెడ్డి తెలియజేశారు. 30 ఏళ్ల రాజకీయ అనుభవమంటూ గొప్పలు చెప్పుకుంటున్న పయ్యావుల కేశవ్ నియోజక వర్గానికి చేసిన మేలు శూన్యమన్నారు. ఓటర్లను , ఎన్నికల అధికారులను భయభ్రాంతులకు గురి చేసి దొంగ ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి హైదరాబాదులో మకాం వేస్తాడన్నారు. దొంగ ఓట్లతో గద్దెనెక్కే టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్.. ఇక ఆయన ఆటలు సాగవని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఇంటికి పంపడం ఖాయమన్నారు. అధికారం ఉన్నా.. అధికారంలో లేకపోయినా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ప్రజా సంక్షేమానికి, నియోజక అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రామాంజనేయులు, రంగారెడ్డి, చంద్రశేఖర్, ఓబుళమ్మ, ధనుంజయ్య, ఎంపీటీసీ సభ్యులు రమేష్, శివలాల్ రెడ్డి, ఎంపీపీ నారాయణ రెడ్డి , వైస్ ఎంపీపీలు దేవ, సుబ్బమ్మ, అగ్రి అడ్వైజరీ మండల చైర్ పర్సన్ నిర్మలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్ర, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, మండల కోఆప్షన్ సభ్యుడు సర్దార్, పార్టీ నేతలు రామసుబ్బారెడ్డి, క్రిష్టప్ప, మదన్‌మోహన్ రెడ్డి, హరీష్, గంగాధర్, వెంకటరామిరెడ్డి, నరేష్, సంగప్ప, శంకర్‌నాయక్, మంజునాథ్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం

- అనంతపురం ఎంపీ తలారి రంగయ్య


మానిరేవులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ సారథి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని పాతచెరువు, ఓబుగానిపల్లి, మానిరేవు, నుసికొట్టాల తండా, నుసికొట్టాల, కదరంపల్లి, బాల వెంకటాపురం, పింజిరి కొట్టాల, కదరకుంట, మంగళకుంట, తిమ్మసముద్రం, కొండాపురం, వెంకటాపురం ముద్దినాయన పల్లి, మౌతికపురం, కాపర్లపల్లి, పీటీఆర్ పల్లి, వర్లి, తూర్పుకోడిపల్ల, మల్లిపల్లి, గ్రామాల్లో ఎంపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త పర్యటించారు. మానిరేవు పంచాయతీలో రూ. 80 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే భవనాలను ఎంపీ ప్రారంభించారు. అనంతరం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు న్యాయం..

ఎంపీ రంగయ్య మాట్లాడుతూ ఈ ఐదేళ్ల పాలనలో పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని, ప్రతి పేదవాడికి న్యాయం జరగాలంటే తిరిగి ఆయన్ను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కేవలం ఐదేళ్లలోనే ఇన్ని పథకాలు అమలు చేశారంటే.. మళ్లీ అధికారంలోకొస్తే మరెన్నో పథకాలను పేద ప్రజల కోసం అమలు చేస్తారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోనే అమలవుతున్నాయన్నారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, ఎంపీపీ మారుతమ్మ, జెడ్పీటీసీ బొమ్మన్న, మండల కురుబ సంఘం అధ్యక్షులు, దొణస్వామి, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఫణీ, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, మానిరేవు సర్పంచ్ జోగిరెడ్డి, ఎంపీటీసీ ఓబులపతి, గొల్ల సూరి, గొల్ల మోహన్ రెడ్డి, నాయకులు మల్లాపురం మల్లి, నాగభూషణ్, జరాంరెడ్డి, అంజి, గోవిందప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిక


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ రంగయ్య

కంబదూరు: మండలంలోని కురాకులపల్లికి చెందిన టీడీపీ నాయకులు చింతాకు జైరాం, వీరంపల్లి శ్రీనివాసులు అనంతపురం ఎంపీ తలారి రంగయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. వారికి ఎంపీ పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు రవి, గంగన్న, గోపాల్, హనుమంతు తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం


రాయదుర్గం బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాట్లలో నిమగ్నమైన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాయదుర్గంటౌన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పట్టణంలో మూడు కేంద్రాలు, కణేకల్లులో 1, బొమ్మనహాళ్‌లో 1, డి.హీరేహాళ్‌లో 1 చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పా టు చేశారు. డి.హీరేహాళ్‌లోని జెడ్పీహైస్కూల్‌లో, కణేకల్లు, బొమ్మనహాళ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన దాదాపు 1,913 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు బుధవారం పరీక్షలకు హాజరుకానున్నారు. గురువారం జరిగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,242 మంది పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు గురువారం ఆయన తెలిపారు. బొమ్మనహాళ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూనియర్ కళాశాల, కేజీబీవీ విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 287 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 144 మంది పరీక్ష రాస్తున్నారన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

కణేకల్లు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. సుమారు 2వేల బైక్‌లతో ర్యాలీ జరగనుంది. సీఎం అమలు చేస్తున్న 'అమ్మఒడి', 'వైఎస్సార్ రైతు భరోసా', 'వైఎస్సార్ చేయూత', 'వైఎస్సార్ ఆసరా' జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలను ట్రాక్టర్లతో ప్రదర్శిస్తూ ర్యాలీ కొనసాగనుంది. దీని కోసం 50 ట్రాక్టర్లు 'సిద్ధం' చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రామనగర్‌లోని అంబేద్కర్ సర్కిల్ నుంచి దిగువవీధి వరకు మెయిన్‌రోడ్డు మీదుగా ముందుకెళ్లి ఆ తర్వాత సంజయ్‌నగర్, నేసేపేట మీదుగా ర్యాలీ చేస్తున్నట్లు మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ కేశవరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త కె.శంకర్‌నారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

నేడు విద్యుత్‌సరాఫరాకు అంతరాయం

గుమ్మఘట్ట: మండలంలోని కేపీ దొడ్డిలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ బాలచంద్ర తెలిపారు.

ప్రధాన సమస్యల పై దృష్టి సారించండి

- సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి


మెట్టును సన్మానిస్తున్న నూతన కమిషనర్ కిశోర్

రాయదుర్గం: పట్టణంలోని ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ కిశోర్‌కు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా కిశోర్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మెట్టు గోవిందరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలో నెలకొన్న అనేక సమస్యలపై మెట్టు కమిషనర్ తో చర్చించారు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వీధిలైట్ల ఏర్పాటు తో పాటు పారిశుద్ధ నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యాలయంలో ఏర్పడిన ఖాళీల విషయంపైనా చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ అకౌంటెంట్ ఈశ్వర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పశు బీమా చేయించుకోండి

కూడేరు: పాడి, పశుపోషణ, జీవాల పెంపకందారులు వైఎస్సార్ పశు బీమాని పశువులకు చేయించుకోవాలని పశు వైద్యాధికారి శ్రీనివాసులు తెలి పారు. గురువారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల తమ వాటా కింద 20 శాతం చెల్లిస్తే, 80 శాతం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. 2 నుంచి 10 ఏళ్ల వయసు ఉన్న నాటీ ఆవులు, 3 నుంచి 12 ఏళ్ల వయసు లోపు మేలుజాతి, సంకర జాతి పాడి పశువులకు బీమా వర్తిస్తుందన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించా రు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మసముద్రం : మండలంలోని బ్రహ్మసముద్రం, పాలవెంకటాపురం గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. కొద్ది కాలంగా తాగునీటి సమస్య ఉందని ఎంపీ తలారి రంగయ్య దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. దీంతో ఎంపీ నిధుల కింద పాలవెంకటాపురం గ్రామానికి రూ. 3 లక్షలు, బ్రహ్మసముద్రం ఎస్సీ కాలనీకి రూ.5 లక్షలు మంజూరు చేశారు. నూతనంగా బోరు వేయించారు. జెడ్పీటీసీ ప్రభావతి, సర్పంచ్ పూజా, మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలబండ్ల చంద్రశేకర్ రెడ్డి, జిన్నా మల్లి, గ్రామస్తులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదులొస్తే చర్యలు


కూడేరు: ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించలేదని కూలీల నుంచి ఫిర్యాదులొస్తే శాఖాపరమైన చర్యలుంటాయని ఏపీడీ విజయ లక్ష్మి అన్నారు. గురువారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పనుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. రోజు ఎంత మంది కూలీలు పనులకు వస్తున్నారని ఆరా తీశారు. జాబ్ కార్డు కలిగి ఉండి పనులకు వచ్చే ప్రతి కూలీకీ పనులు కల్పించాలని ఆదేశించారు. మస్టర్ నమోదు పక్కాగా ఉండాలన్నారు. కూలీల సంఖ్య పెరగాలని సూచించారు. పనులు చేసిన వెంటనే కొలతలు తీసి బిల్లుకు పెట్టాలని తెలియజేశారు. 2024-25 ఏడాదికి గాను హార్టికల్చర్ కింద మొక్కల పెంపకానికి సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజనీర్ రవి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధర్మపురిలో గడ్డివాముల దగ్ధం

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురిలో నేసే సూర్యనారాయణ, హరినాథరెడ్డికి చెందిన రెండు గడ్డివాములు గురువారం కాలిపోయాయి. ఉరవకొండ ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. సర్పంచు సోమశేఖర్‌రెడ్డి పరిశీలించి,జరిగిన నష్టాన్ని అధికారులకు తెలియజేశారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

- జిల్లా తపాలాశాఖ సూపరింటెండెంట్ హరిబాబు



రాయదుర్గం టౌన్: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు, ఖాతాదారులకు జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు పిలుపునిచ్చారు. రాయదుర్గంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్న మొత్తాల పొదుపులకు సంబంధించి తపాలా శాఖ ఆకర్షణీయమైన అత్యధిక వడ్డీ అందజేస్తోందన్నారు. మరోవైపు బ్యాంకింగ్ ఆన్‌లైన్ సేవలతో పాటు సుకన్య సమృద్ధి యోజన, సేవింగ్ డిపాజిట్, ఆర్‌డీ, ఫిక్స్‌డ్ డిపాజిట్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని రెండు ప్రధాన పోస్టాఫీసులు, 63 సబ్ పోస్టాఫీసుల్లో ఈ సేవలను వినియోగదారులు పొందొచ్చన్నారు. రాయదుర్గం పోస్టాఫీసులో పోస్టుమాస్టర్‌తోపాటు పోస్టల్ ఇన్‌స్పెక్టర్, ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, త్వరలో వాటిని భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. రాయదుర్గంలో ప్రజలకు ఎంతో అందుబాటులో ఉండి రద్దు చేయబడిన బజారు పోస్టాఫీసును త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. అనంతరం ఆయన పోస్టల్ ఏజెంట్లతో సమావేశమై పొదుపు, బీమా పథకాలపై అవగాహన కల్పించారు.